నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 1 ఏప్రిల్ 2025 | NIZAMABAD

- ఆ పార్టీ నాయకుల్లోనూ అసంతృప్తి
- ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు..
- ఎన్నికలు ఉన్నప్పుడే రేవంత్ సర్కార్ రైతుభరోసా ఇస్తున్నది..
- కేసీఆర్ హయాంలో నాట్లు ఉన్నప్పుడు రైతుబంధు ఇచ్చాం
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- వేముల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు


గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

# కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

వేల్పూర్, మార్చి 31: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల్లోనూ అసంతృప్తి నెలకొనడంతో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే నివాసంలో సోమవారం వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా..వారికి వేముల గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలు ఉన్నప్పుడే రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో వేస్తున్నదని, ఎన్నికలు ముగిశాక వేయడంలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నాట్లు వేస్తున్నప్పుడు రైతు బంధు ఇస్తే, రేవంత్‌రెడ్డి ఓట్లు ఉన్నప్పుడే రైతుభరోసా ఇస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మోసపూరిత, కక్షపూరిత పరిపాలన కొనసాగిస్తున్నదని మండిపడ్డారు. ఆ పార్టీ ఓట్ల కోసమే ఎన్నో మోసపూరిత హామీలు ఇచ్చి, ఆరు గ్యారెంటీల ద్వారా అధికారంలోకి వచ్చిందన్నారు. వంద రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి 500 రోజులు గడిచినా ఇప్పటివరకూ ఒక్క హామీని సక్రమంగా అమలుచేయడంలేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అసహనానికి లోనై నాయకులు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో ప్రజల పక్షాన నిలదీస్తున్నామని, తాము అధికారంలో లేకున్నా ఈ సమయంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ నైజం రైతులకు అర్థమైంది..**

కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఎకరానికి రూ.10వేలు ఇస్తే, తాము అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి, ఇప్పుడు ఎకరానికి రూ.12 వేలు వేశారని తెలిపారు. కేసీఆర్ వెంట ఉన్న రైతులను మోసపూరిత హామీలు ఇచ్చి తమ వైపునకు తిప్పుకున్నదని కాంగ్రెస్ నైజం రైతులకు తొందరగా అర్థమైందన్నారు. మహాలక్ష్మి పథకం కింద రూ.2500, రూ. 4వేలు పింఛన్, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు ఎక్కడని ప్రశ్నించారు. 50వేల ఉద్యోగాలు అన్నారని, అవి కూడా లేవన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. కేవలం 11వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలకు నియామకపత్రాలు ఇచ్చి వాటిని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

**బీఆర్‌ఎస్‌లో చేరింది వీరే..**

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పల్లికొండ నర్సయ్య, భీమ్‌గల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దరావత్ లింగం, మోర్తాడ్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తక్కురూ రంజిత్, భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్ పెద్దమ్మకాడి తండా తాజా మాజీ సర్పంచ్ లౌడియ రమేశ్‌నాయక్‌తోపాటు వారి అనుచరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పల్లికొండ నర్సయ్య తన పదవి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు.

**కేసులకు భయపడేదిలేదు..**

ప్రజల అండ ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తామని, ప్రజా క్షేత్రంలో ప్రశ్నిస్తూనే ఉంటామని వేముల స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైలుకు పంపి భయపెట్టాలని చూస్తున్నదని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని జైళ్లకు పంపినా భయపడే ప్రసక్తేలేదన్నారు. తెలంగాణ ఉద్యంలో అనేక సార్లు జైలుకు వెళ్లి వచ్చామని వేముల గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబులాంటి పెద్ద నాయకులను ఎదురించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర బీఆర్‌ఎస్‌కు ఉన్నదన్నారు. వారి ముందు రేవంత్‌రెడ్డి ఎంత అని, ఆయన ఊకదంపుడు బెదిరింపులకు ఎవరూ భయపడబోరని అన్నారు.

**పోలీసులు చట్టాలకు లోబడి పనిచేయాలి..**

సోషల్ మీడియాలో హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని వేముల ఆరోపించారు.పోలీసులు చట్టాలకు లోబడి పని చేయాలని, అన్ని రోజులు కాంగ్రెస్ పార్టీవి కాదన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లుగా అతి ఉత్సాహంగా తమ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే కాలం ఒకలా ఉండదన్నారు. అధికారం మారినప్పుడు ఆ పోలీస్ అధికారి ఎవరైనా..ఎక్కడ ఉన్నా ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరించారు.అలాంటి అధికారుల పేర్లను నోట్ చేసుకుంటున్నామని, ఉద్యోగ విరమణ పొందిన సరే వారిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. అధికారంలో లేకున్నా ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న బీఆర్‌ఎస్‌లో చేరి తమకు మరింత బలాన్ని ఇచ్చిన వారికి వేముల కృతజ్ఞతలు తెలిపారు.

- తడారిన మడులు.. తల్లడిల్లుతున్న రైతులు
- వందలాది ఎకరాల్లో ఎండిన పంటలు



**పలు మండలాల్లో సాగునీటికి కటకట**

# ఎత్తేసిన బోర్లు.. మిగిలింది కన్నీళ్లు

మాచారెడ్డి/రాజంపేట, మార్చి 31 : చేతికొచ్చిన పంటలు కండ్ల ముందే ఎండుతుంటే రైతాంగం తల్లడిల్లుతున్నది. బోర్లు ఎత్తిపోయి పొలాలు నోళ్లు తెరుస్తుంటే ఆగమవుతున్నది. చి'వరి' తడి కోసం శక్తికి మించి రైతులు తండ్లాడుతున్నారు. పాత బోర్లు ఫ్లషింగ్ చేయిస్తున్నా ఫలితం లేదు. కొత్త బోర్లు వేయిస్తున్నా చుక్కనీరు రావట్లేదు. ట్యాంకర్లతో నీళ్లు పెడుతున్నా ఏమూలకు సరిపోవట్లేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడితో పాటు చివరి తడి నీరందించేందుకు చేస్తున్న ఖర్చు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని రైతులు గుండెలు బాదుకుంటున్నారు. పదేండ్లలో గిట్లాంటి గోస ఎప్పుడూ పడలేదని గుర్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

**క'న్నీటి' కష్టాలు..**

ఉమ్మడి జిల్లాలోని అనేక మండలాల్లో సాగునీటి కష్టాలు రెట్టింపయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఎత్తిపోతున్నాయి. ప్రధాన ప్రాజెక్టులతో పాటు చెరువుల్లో నిల్వలు తగ్గుముఖం పట్టాయి. కాలువల ద్వారా వచ్చే నీళ్లు చివరి ఆయకట్టుకు అందడం లేదు. మరో నెల రోజులు, కనీసం రెండు, మూడు తడులు పెడితే కానీ పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదు. కానీ ఇప్పటికే నీరందక వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. మాచారెడ్డి, రాజంపేట, ధర్పల్లి, సిరికొండ తదితర మండలాల్లో పరిస్థితి దారుణంగా ఉన్నది. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత పెరగడం, భూగర్భ జలాలు మరింత అడుగంటే పరిస్థితి ఉండడంతో సాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదమున్నది.




తలమడ్లలో నెర్రెలు బారిన పొలం

**గిట్ల ఎప్పుడూ లేకుండే..**

నాకు బుద్ధి తెలిసిన సంది ఎవుసం జేత్తున్న. యాట రెండు పంటలు తీత్తున్న. మూడు బోర్లతోటి ఎనిమిది ఎకరాలు పండిత్తున్న. 20 ఏండ్ల సంది బోర్లు ఎత్తిపోతే. ఈసారి ఏమైందో ఏం పాడో మూడిటికి మూడు ఎత్తేసినయ్. ఫ్లషింగ్ చేపిచ్చినా నీళ్లు రాలే. నాట్లు ఏసేతందుకు, మందులకు లచ్చ ఎనభై ఏలు, బోర్ల కోసం లచ్చ ఖర్చు పెట్టిన. రూపాయి కూడా అచ్చేటట్లు లేదు. సర్కారోళ్లే మమ్ముల్ని ఆదుకోవాలె.

**- పల్లపు రాములు,**
**ఎల్లంపేట, మాచారెడ్డి మండలం**



**ఐదెకరాల పంట పోయింది..**

మాచారెడ్డి మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన పల్లపు రాములుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. యాసంగిలో ఎనిమిది ఎకరాల్లో వరి వేశాడు. పైరు పొట్ట పోసుకునే దశలో ఉండగా సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఉన్న మూడు బోర్లు ఎత్తిపోయాయి. కండ్ల ముందే పంట ఎండుతుండడంతో అప్పు తెచ్చి బోర్లకు ఫ్లషింగ్ చేయించాడు. 500 ఫీట్ల లోతు వరకు ఫ్లషింగ్ చేయించినా నీటి చుక్క జాడ కరువైంది. రూ.లక్ష దాకా ఖర్చు పెట్టినా ఫలితం లేకపోవడంతో రాములు, ఆయన కుమారులు పంటపై ఆశలు వదిలేసుకున్నారు. ఐదెకరాలు ఇప్పటికే ఎండిపోగా, మిగిలన మూడెకరాల పంట చేతికొచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.



**రెండు బోర్లేసినా చుక్క రాలేదు..**

నీళ్లకు రందీ లేదని రెండెకరాలల్ల వరి, ఎకరంలో మక్క వేసిన. పంట చివరి దశకొచ్చే సరికి బోర్లు ఎత్తిపోయినయ్. చేతికచ్చిన పంట కండ్ల ముందర ఎండుతుంటే దిక్కు తోచలే. ఎట్లయినా పంటను కాపాడుకోవాలని అప్పు తెచ్చి రెండు బోర్లు ఏసిన. చుక్క నీరు కూడా రాలేదు. పంటలు ఎండిపోయి లాగోడి మీద పడి అప్పులు పాలైనం.

**- మొకద్దం అశోక్, రైతు, తలమడ్ల**

**అప్పు ఎట్ల తీర్చుడో ఏమో..**

ఐదెకరాలల్ల వరి ఏసిన. మొన్నటి దాక మంచిగానే పోసిన బోర్లు పొలాలు పొట్ట కొచ్చే టైంల ఎత్తేసినయ్. చెర్లు, కుంటలల్ల నీళ్లు ఉంటే బోర్లు పోసేటియి. రెండు, మూడు తడులు పెడితే అడ్లు చేతికొత్తుండే. నీళ్లు లేక ఇడుసపెట్టిన. అప్పు తెచ్చి లాగోడి మీద పెట్టిన. ఇప్పుడు అది పడ్డది. ఎట్ల తీర్చాల్నో ఏమో అర్థమైతలేదు.



**- కట్లెకుంట్ల భూమయ్య, రైతు, రాజంపేట**

# హెచ్‌సీయూ భూముల వేలాన్ని విరమించుకోవాలి

ఖలీల్‌వాడి, మార్చి 31 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి చెందిన 400 ఎకరాల భూముల వేలాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని పీడీఎస్‌యూ నాయకుడు డిమాండ్ చేశారు. వర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలని ఆందోళన చేపట్టిన పీడీఎస్‌యూతోపాటు ఇతర విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసుల దౌర్జాన్యాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల ఎదుట రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేశ్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో పీడీఎస్‌యూ నాయకులతోపాటు ఇతర విద్యార్థి నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేసి, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీకి అప్పగించిన 400 ఎకరాలను వెంటనే యూనివర్సిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని కోరారు. విద్యాసంస్థల భూములను అమ్ముకునే వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం వీడనాడాలని లేకుండా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ నాయకులు వరుణ్, సాయి, రాజు, నవీన్, రాకేశ్, వంశీకృష్ణ పాల్గొన్నారు.




ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

# బాలుడి హత్య కేసులో నిందితుల అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

వినాయక్‌నగర్, మార్చి 31: నగరంలోని ఉమెన్స్ కళాశాల వద్ద మూడురోజుల క్రితం ఓ బాలుడి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితులు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలూకా సరస్వతీ నగర్‌కు చెందిన బోస్లే మాలాబాయి, ఆమె కుమారుడు గోపాల్ బ్రూస్లీగా గుర్తించినట్లు వన్‌టౌన్ హెచ్‌ఎస్‌వో బి. రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నయాబాది తాలూకాకు చెందిన కాశనాథ్ కమలాబాయి తన కుమారుడు కైలాస్(14 నెలలు)తో కలిసి మార్చి 27న నిజామాబాద్ జిల్లా కేంద్రానికి భిక్షాటన కోసం వచ్చింది. అదే రోజు రాత్రి నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో నిద్రించగా..మధ్యరాత్రి లేచి చూడగా తన కుమారుడు కనిపించలేదు. దీంతో ఆమె వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మరుసటి రోజు కంఠేశ్వర్ ఉమెన్స్ కాలేజీ సమీపంలో కైలాస్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించి, హత్య కేసు నమోదు చేశారు. కంఠేశ్వర్ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు కలిసి బాలుడిని కిడ్నాప్ చేసినట్లు ఆనవాళ్లు గుర్తించారు. సోమవారం నగరంలోని మాలపల్లి ఏరియాలో భిక్షాటన చేస్తుండగా నిందితులైన బోస్లే మాలాబాయి, ఆమె కుమారుడు గోపాల్ బ్రూస్లీని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా బాలుడు కైలాస్‌ను తామే హత్యచేసినట్లు ఒప్పుకున్నారు. కమలాబాయి తన చిన్న కుమారుడైన కైలాస్‌ను అడ్డుపెట్టుకొని భిక్షాటన చేస్తుండడంతో, ఆమెకు తమకన్నా ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తుండేవని, వారిపై కక్ష పెంచుకొని బాలుడిని హత్యచేసినట్లు నిందితులు అంగీకరించారని ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిందితులైన తల్లీకొడుకులపై కేసు నమోదుచేసి,రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసును ఛేదించిన ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఎస్సై రాజేశ్వర్, కానిస్టేబుళ్లు గంగారాం, రాంబాబు, రవిని సీపీ సాయి చైతన్య, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి అభినందించారు.

కామారెడ్డిలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నిజామాబాద్ జిల్లాకేంద్రంలో..



# ఘనంగా రంజాన్

- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు

**ఉమ్మడి జిల్లాలో** ముస్లింలు సోమవారం రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పిల్లలు, పెద్దలు నూతన దుస్తులు ధరించి పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈద్గాల వద్దకు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు తరలివెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉన్న ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును సీపీ సాయి చైతన్య పర్యవేక్షించారు.

–సుభాష్‌నగర్, మార్చి 31


భీమ్‌గల్‌లో ముస్లిం పెద్దను ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి వేముల


నిజామాబాద్‌లో ఈద్గా వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ సాయి చైతన్య


కామారెడ్డిలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర